క్లుప్తంగా

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం



బాల్కొండ: బాల్కొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఇన్‌చార్జి మంత్రి సీతక్క చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు అర్విండ్, నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండల కేంద్రంలో..

ముప్కాల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, ఏఎంసీ మార్కెట్ కమిటీడైరెక్టర్ జైడి రవి, డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగాసన పోటీలో విద్యార్థిని ప్రతిభ



బోధన్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన యోగాసన స్పోర్ట్ చాంపియన్ షిప్ పోటీల్లో సాలూర ప్రజ్ఞశ్రీ హైస్కూల్ విద్యార్థిని ఎం. శారద ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లత రాజు మాట్లాడుతూ శారద నిజామాబాద్ ఏసీపీ బసవ రెడ్డి నుంచి బంగారు పతకం అందుకుందని తెలిపారు. విద్యార్థిని శారదను సోమవారం కరస్పాండెంట్, పాఠశాల బృందం అభినందించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఏసీ బస్సులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్టీసీ డిపో నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఈనెల 3 నుంచి రాజధాని ఏసీ బస్సులు నడపుతున్నట్లు డిపో మేనేజర్ రవికుమార్ సోమవారం తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6:15 నిమిషాలకు, రాత్రి 9:30 గంటలకు ఆర్మూర్ నుంచి బస్సు బయలుదేరుతుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మోర్తాడ్/మాక్లూర్ : మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో ఇద్దరు బాధితులకు మంజూరైన రూ. 36,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు మైత్రీ,, ముత్యాల రాములు, రొక్కం మురళి, బద్దం రాజశేఖర్, కుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.మాక్లూర్ మండలం రామచందర్ పల్లి గ్రామంలో బాధితుడు కటకం గంగాధర్‌కు మంజూరైన రూ.25,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక కాంగ్రెస్ నాయకులు అందించారు.కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సక్కి ప్రభాకర్, గంగారం, భూపతి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఆబాది గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై సునీల్ సోమవారం తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ. 1,120 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

పూజలందుకుంటున్న వినాయకులు



నందిపేట్/బాల్కొండ/నవీపేట/బోధన్ : నందిపేట మండల కేంద్రంతో పాటు వెల్మల్ లో విభిన్న రకాల వినాయకులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శ్రీ యూత్ సభ్యులు 1700 రూబిక్ క్యూబ్‌లతో చేసిన గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మండపాల్లో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు సోమవారం పూజ లు చేశారు. మండపాల నిర్వాహకులు అన్నదానం చేశారు.



చెదిరిన చెక్‌డ్యాంల కలలు

- వరద ఉధృతికి కొన్ని చోట్ల కోతకు గురైన చెక్‌డ్యాంలు
- దొన్కల్ వద్ద ఒక భాగం పూర్తిగా నీటిపాలైన చెక్‌డ్యాం కట్ట
- రైతులకు శాపంగా మారిన నిర్మాణ లోపం



సుంకెట్ చెక్‌డ్యాం వద్ద మట్టి కట్ట కొట్టుకుపోవడంతో పంట పొలాల్లోకి చేరిన నీరు

మోర్తాడ్(బాల్కొండ): వాగుల్లోకి చేరిన వర్షపు నీటిని నిలువ చేసుకుంటే సాగునీటి కష్టాలను అధిగమించవచ్చని భావించిన వారికి కన్నీళ్లే మిగిలిపోతున్నాయి. చెక్‌డ్యాంల నిర్మాణంలో తలెత్తిన లోపాలు రైతులను వరుసగా వెంటాడుతున్నాయి. ఫలితంగా చెక్‌డ్యాంలు వరదలకు తట్టుకోలేక కోతకు గురైతుండటంతో వందలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. బాల్కొండ నియోజకవర్గంలో విస్తరించిన పెద్దవాగు, కప్పల వాగులో 12 చోట్ల చెక్‌డ్యాంలను నిర్మించగా దొన్కల్ వద్ద ఏడేళ్ల కింద నిర్మించిన చెక్‌డ్యాం వరద తాకిడిని తట్టుకోలేక ఒక చోట చెక్‌డ్యాం పూర్తిగా కొట్టుకపోయింది. సుంకెట్ చెక్‌డ్యాం వద్ద గతంలో మాదిరిగానే మట్టి కట్ట పూర్తిగా కొట్టుకపోవడంతో పంట పొలాలకు నీరు వచ్చి చేరి దాదాపు 40 ఎకరాల్లోని పంటలు నేలకొరిగాయి. మోతె వద్ద చెక్‌డ్యాం కట్ట కోతకు గురికావడంతో పరిసరాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేసింది.

కొంపముంచిన సుమోటో అనుమతులు..

చెక్‌డ్యాంల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో సుమోటో అనుమతులతోనే చెక్‌డ్యాంల నిర్మాణంను ఆరంభించారు. 12 చెక్‌డ్యాంలలో కేవలం నాలుగింటికి మాత్రం అన్ని రకాల అనుమతులు లభించాయి. ఇది ఇలా ఉండగా చెక్‌డ్యాంల డిజైనింగ్‌లోనే పెద్ద లోపం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన చెక్‌డ్యాంలకు ఒకే రకమైన డిజైనింగ్‌ను రూపొందించడంతోనే అసలు సమస్య మొదలైందనే వాదన బలంగా వినిపిస్తుంది. వాగు పరిమాణం, వరద ఉధృతి లెక్కలు, భూగర్భంలోని స్థితిగతులను అంచనా వేసిన తరువాతనే డిజైనింగ్ తయారు చేసి చెక్‌డ్యాంలను నిర్మించాల్సి ఉంది. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని చెక్‌డ్యాంల నిర్మాణంకు డిజైన్‌ను రూపొందించాల్సి ఉంది. హైడ్రాలిక్ అనుమతుల విషయంలోను తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తుంది.

అధికారుల మాట లెక్క చేయకుండానే..

చెక్‌డ్యాంల నిర్మాణం విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు మాటలకు ప్రాధాన్యత లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసమే చెక్‌డ్యాంల నిర్మాణంకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేయించుకున్నారని వెల్లడైతుంది. ఈ కారణంగానే చెక్‌డ్యాంలు గడచిన మూడేళ్లుగా వరదలకు తట్టుకోలేక ఎక్కడో ఒక చోట కోతకు గురైతూ పంటలను నీట ముంచుతూనే ఉన్నాయి.



వరద నీటి తాకిడికి మధ్యలో కొట్టుకుపోయిన దొన్కల్ చెక్‌డ్యాం

సమగ్ర విచారణ జరిపించాలి



చెక్‌డ్యాంల నిర్మాణంలో అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చెక్‌డ్యాంల నిర్మాణంలో చోటు చేసుకున్న లోపాలపై విచారణ జరిపించాలి.

– గద్దం శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దొన్కల్

ప్రతి ఏటా తీవ్ర నష్టం



నాలుగైదు ఏళ్ల నుంచి చెక్‌డ్యాం కోతకు గురైతుండటంతో తీవ్ర నష్టం జరుగుతుంది. పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు చేతికి అందే పరిస్థితి లేదు. ఇసుక మేటలు వేయడం, పొలాలు కోతకు గురైతుండటంతో మట్టిని నింపుకోవడానికి లక్షలు ఖర్చు చేస్తున్నాం. నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి. – నవీన్ యాదవ్, రైతు, సుంకెట్

లంబాడాల జోలికి వస్తే ఊరుకోం



బోధన్‌లో దిష్టి బొమ్మలతో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): లంబాడాల జోలికి వస్తే ఊరుకునేది లేదని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు జాదవ్ ప్రవీణ్ హెచ్చరించారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తెల్లం వెంకట్రావ్, సోయం బాపురావ్‌లు సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెల్లం వెంకట్రావ్, సోయం బాపురావుల దిష్టి బొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడారు. లంబాడాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్న వీరిని కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. బోధన్ మండల ఏబీబీఎస్ అధ్యక్షులు విశ్వనాత్ నాయక్, ప్రతినిధులు శ్రీనివాస్ నాయక్, గంగాధర్ నాయక్, తదితరులున్నారు.

మహాధర్నాకు తరలిన టీచర్లు



మహా ధర్నాకు వెళ్తున్న కమ్మర్‌పల్లి మండల ఉపాధ్యాయులు

రుద్రూర్/కమ్మర్‌పల్లి/రెంజల్ : సీపీఎస్‌కు వ్యతిరేకంగా పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద సోమవారం నిర్వహించిన మహా ధర్నా కార్యక్రమానికి జిల్లా నుండి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని వారు డిమాండ్ చే శారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయుల కోరారు.



కోటగిరి ఉమ్మడి మండలం నుంచి మహధర్నాకు వెళ్లిన ఉపాధ్యాయులు

పంట నష్టగణనకు సహకరించాలి



మందర్నాలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏవో శ్వేత

బోధన్: వర్షాలతో నీటమునిగిన పంటల వివరాల సేకరణకు చేపట్టనున్న గణనకు రైతులు సహకరించాలని సాలూర వ్యవసాయ అధికారిణి శ్వేత తెలిపారు. సోమవారం మండలంలోని మందర్నా, హున్సా గ్రామాల్లో వరద నీట మునిగిన పంటలను పరిశీలించారు. హున్సా గ్రామంలో రైతులతో ఏవో మాట్లాడారు. పంటల నష్ట గణనకు ఏఈవోలు ఏ గ్రామాలకు ఎప్పుడు వచ్చేది ముందస్తు సమాచారం అందించి వస్తారని పేర్కొన్నారు. పంట నష్టం వాటిల్లిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలు సమయానికి అందుబాటులో పెట్టుకుని ఏఈవోలకు అందించాలని కోరారు.

రైతులెవరూ అధైర్య పడొద్దు

సాలూర మండలం తగ్గెల్లి గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి, నాయకులు పర్యటించి పరిశీలించారు. రైతులెవరూ అధైర్య పడొద్దని, ఇక్కడి పరిస్థితులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. నాయకులు అనిల్, సరిడే సాయిలు, శివకాంత్ పటేల్,దేవరావు,లక్ష్మణ్ పటేల్, దేవరావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం



పోతంగల్ మండలం హంగర్గ లో వినాయక నిమజ్జన శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



పోలాండ్‌లోని బ్రెజెనో బీచ్‌లో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న జిల్లా వాసులు



రుద్రూర్ మండలం వినాయక శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు



రుద్రూర్ సిద్ధి వినాయకుడి మండపం వద్ద హోమంలో పాల్గొన్న భక్తులు

రుద్రూర్ : పోతంగల్, రుద్రూర్ మండలాల్లో సోమవారం వినాయక నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. పోతంగల్ మండలం హంగర్గ గ్రామంలో, రుద్రూర్ మండలం చిక్కడపల్లిలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో చిన్నారులు, మహిళలు, యువకులు భజనలు, కోలాటం, నృత్యాలు చేశారు. వినాయకులను హంగర్గాలో మంజీరా నదిలో, చిక్కడపల్లిలో గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. రుద్రూర్‌లోని సిద్ధి వినాయకుని మండపంలో హోమం నిర్వహించారు.

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్, ఆర్మూర్ పట్టణంలోని ప్రజలు పోలాండ్‌లోని గడాన్స్క సిటీలో వివిధ పనుల నిమిత్తం ఉన్నారు. వినాయక చవితి వేడుకలను ఘనంగా భక్తి, శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం వినాయకునికి పూజలు నిర్వహించి పోలాండ్‌లోని బ్రెజెనో బీచ్ వద్ద నిమజ్జనం చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు..



బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందిస్తున్న డివిజన్ సీపీఎం నాయకులు

బోధన్/ఆర్మూర్/ వర్ని/నవీపేట/కమ్మర్‌పల్లి : భారీ వర్షాలు,వరద కారణంగా నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం బోధన్ ఏరియా కార్యదర్శి జంబిశెట్టి శంకర్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్‌ఆఫీస్ ఎదుట నాయకులు నినాదాలు చేసి సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతి పత్రం అందించారు.ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో రైతులను ఆదుకోవాలని సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడారు.మోస్రా తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేసి మండల రెవెన్యూ పెక్టర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా సీపీఎం పార్టీ వర్ని ఏరియా కార్యదర్శి నన్నే సాబ్ మాట్లాడారు. నవీపేట మండలంలో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ వెంకట రమణకు వినతి సమర్పించారు. బాధితకుటుంబాలను, రైతులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్ డిమాండ్ చేశారు. ఆయన కమ్మర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు ఎకరానికి రూ.50 వేలు పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉన్నారు.



నవీపేటలో తహసీల్దార్ వెంకట రమణకు..



మోస్రా తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నవీపేట మండలంలోని మిట్టాపూర్‌లో..



మందర్నాలో బాధిత కుటుంబాలకు సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్న మేడపాటి ప్రకాశ్ రెడ్డి

బోధన్/నవీపేట/రెంజల్/బోధన్‌రూరల్/రుద్రూర్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలు ,వరద ప్రభావిత గ్రామాల బాధితులకు ఎంపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని ఆడంబరాలకు దూరంగా బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. సాలూర మండలం ఖాజాపూర్, మందర్నా గ్రామాల్లో 200కి పైగా వరద బాధిత కుటుంబాలకు, నవీపేట మండలం మిట్టాపూర్, అల్జాపూర్ గ్రామాల్లో 300 రైతు కుటుంబాలకు, రెంజల్ మండలం తాడ్‌బిలోలి, బోధన్ రూరల్ మండలం హంగర్గ గ్రామాల్లో మేడపాటి ప్రకాశ్‌రెడ్డి పర్యటించి సోమవారం వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను అందించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్‌కి చెందిన బైండ్ల గంగాధర్, బుడ్డోళ్ల ఎల్లయ్యలకు బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ టార్పాలిన్ కవర్లు అందజేశారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి



బోధన్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి

బోధన్: వినాయక నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను ఎలాంటి లోపాలకు తావు ఇవ్వకుండా పూర్తి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణ కేంద్రంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో ఏసీపీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ పట్టణ కేంద్రంలో జరుగనున్న వినాయక నిమజ్జన ఏర్పాట్ల పై అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేశారు. పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో,శక్కర్‌నగర్ లోగల వినాయక నిమజ్జన బావి, పసుపు వాగు ఘాట్ వద్ద శోభాయమానంగా అలంకరించాలని సూచించారు. తహసీల్దార్ విఠల్ అధికారులు పాల్గొన్నారు.

బాల్కొండ/నందిపేట్ : గణేశ్ నిమజ్జనోత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏ ర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నందిపేటలో ఎస్సై శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో సీఐ శ్రీధర్‌రెడ్డి మాట్లా డారు. బాల్కొండ ఎస్సై శైలెందర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ట్రాన్స్ కో ఏడీఏ అశోక్ కుమార్, గణేశ్ మండలాల ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్



బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు



వర్నిలో ముందస్తుగా అరెస్టయిన ఆశావర్కర్లు

బోధన్‌టౌన్/వర్ని/రుద్రూర్/బోధన్ : బోధన్ డివిజన్‌లోని వివిధ గ్రామాలకు చెందిన ఆశావర్కర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డిమాండ్ల సాధనకై అసెంబ్లీ ముట్టడించనున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆశా వర్కర్ల అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అనంతరం వారి వివరాలు సేకరించి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. బోధన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జంబిశెట్టి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే నెరవెర్చాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

మన పాఠశాల మన ఆత్మగౌరవం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం తపస్ ఆధ్వర్యంలో 'మన పాఠశాల మన ఆత్మ గౌరవం అనే కార్యక్రమం చేపట్టారు. ఏబీఆర్ఎస్ఎం పిలుపు మేరకు ప్రార్థన సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మన పాఠశాల మన ఆత్మ గౌరవ అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. తపస్ మండలాధ్యక్షులు ఎస్. కిషన్ గౌడ్ కార్యదర్శి రమేష్ డివిజన్ కార్యదర్శి శంకర్ గౌడ్ ,ఆనంద్, మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ, లిటరరీ క్లబ్ ఏర్పాటు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం పాఠశాల ప్రహరి, లిటరరీ క్లబ్ ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడిగా హెచ్ఎం రామ్‌ప్రసాద్, కన్వీనర్‌గా పోలీస్ కానిస్టేబుల్ మాలవత్ రాజు, ఉపాధ్యక్షుడిగా ధర్మేంద్ర, సభ్యులుగా రిషిగౌడ్, మోక్ష,,నేహశ్రీ, విశ్వ తేజ, లక్ష్మీ నర్సయ్య, అభిరామ్, శ్రీశాంత, శ్రీనాథ్, రిత్విక, శృతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమం కోసం ప్రహరి, లిటరరి క్లబ్ ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం రామ్‌ప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేది నుంచి 15 వరకు రీడ్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో పుస్తక పఠనం, కథలు చెప్పడం, కథలు రాయడం, రోల్ ప్లే, ఏకపాత్రాభినయం, క్విజ్, లఘు నాటికలు, స్కిట్ ప్రోగ్రామ్ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. స్వాతంత్ర్య సమర యోధులు, క్రీడాకారులు శాస్త్రవేత్తల గురించి ప్రతి రోజు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తారన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

వర్ని: మండలంలోని అంతాపూర్, పొట్టిగుట్ట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు సొసైటీ ఫర్ ఆల్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి కామిరెడ్డి ముక్తేష్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అంతయ్య, శౌరి రెడ్డి, లలిత, రమేష్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

పెర్కిట్/వేల్పూర్ : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఎస్‌కే వైద్యుడు సంతోష్ కుమార్ విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. హెచ్ఎం శ్రీనివాస్, ఫార్మసిస్టు వి రజిని, ఏఎస్ఎం జ్యోతి, ఉపాధ్యాయులు వెంకటరమణ చారి తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో సోమవారం మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.150 మందికి చాతి ఎక్స్‌రే, 120 మందికి తెమడ పరీక్షలు చేశారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అక్షరపల్లకీ నోట్‌బుక్‌ల ఆవిష్కరణ

వేల్పూర్: వేల్పూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం అక్షరపల్లకీ నోట్‌బుక్‌లను స్థానిక హైస్కూలు, ప్రైమరీస్కూలు హెచ్‌ఎంలు రాజన్న, దత్తసాయిప్రసాద్ ఆవిష్కరించారు. విద్యార్థులు తెలుగు అక్షరాలపై పట్టు పెంచుకునేందుకు ఈ నోట్‌బుక్‌లు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారాం, కృష్ణవేణి,శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.